కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్ల పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చంద్రమోహన్‌సాగర్, చిరుమర్తి రాజు, విమల, స్వప్న పాల్గొన్నారు.

పర్యావరణ ర్యాలీ



పర్యావరణ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం , ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా రేడియల్ రోడ్డు ఆనుకుని మొక్కలు నాటి, పర్యావరణ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ, డీఈ సత్యనారాయణ, ఏఈ మౌనిక, ఆర్ఓ వెంకటరామయ్య, మేనేజర్ అఖిల్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రకృతి సమతుల్యత నశిస్తే వైపరీత్యాలు కలుగుతాయని, జీవరాశుల మనుగడకు ప్రమాదం ఏర్పాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, డాక్టర్ కరుణకుమారి , మరియు ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ మల్లిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ప్రవీణ, అధ్యాపకులు డా.పూనంకుమారి ,డా.సుజాత డాక్టర్ యోగిబాబు, డా.మంజుశ్రీ ,డాక్టర్ శివ దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానించిన నూతన కమిటీ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు జేపీ కాలనీలోని శ్రీ పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సోమ శ్రీనివాస్(కంకర శీను), గౌరవ అధ్యక్షులు మనోహర్ ,కార్యదర్శిగా చవ్వా రమేష్, కోశాధికారిగా పవన్ , కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఆలయంలో పూజ అనంతరం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విరూపాక్ష చంద్రశేఖర్, శ్రీనివాస్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బడిబాట

- విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యం
- ఇంటింటికి వెళ్లనున్న ఉపాధ్యాయులు



నల్లగండ్ల ప్రాథమిక పాఠశాల భవనం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో శుక్రవారం నుంచి బడిబాట జరగనుంది. మండల విద్యాధికారి వెంకటయ్య పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 12వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతాయి.

మండల పరిధిలోని పాఠశాలల సంఖ్య

- ప్రస్తుతం శేరిలింగంపల్లి మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి
- ప్రాథమిక పాఠశాలలు 43
- అప్పర్ ప్రైమరీ స్కూళ్ళు 3
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 13
- ఈ పాఠశాలల్లో 15,998 మంది విద్యార్థులు చదువుతున్నారు.

చేపట్టే కార్యక్రమాలు ఇవే..

- శేరిలింగంపల్లి మండల పరిధిలో శుక్రవారం రనోజు విలేజ్ ఆర్గనైజేషన్స్, తల్లిదండ్రులతో మెగా సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా వారిచే ప్రతిజ్ఞ కూడా చేయించాలని తలపెట్టారు.
- శనివారంరోజు పాఠశాల పరిధిలోని ఇంటింటికి ఉపాధ్యాయులు వెళ్ళి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా అవగాహన కల్పిస్తారు. ప్రత్యేక అధికారులు ఈ సందర్భంగా పర్యవేక్షిస్తారు.
- ఆదివారం నుంచి మంగళవారం వరకు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు మార్గం సుగమం చేస్తారు.
- జూన్11న గ్రామసభ, 12వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బాలసభ, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం..



బడిబాట కార్యక్రమం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. గత ఏడాది 1,621 మంది చేరగా ఈ ఏడాది 2వేల మందిని చేర్పించాలని తలపెట్టాం. అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు- మనబడి కార్యక్రమం కింద సకల సౌకర్యాలు కల్పించడం జరుగుతోంది. సైయింట్, టీచ్ ఫర్ చేంజ్ ఆర్గనైజేషన్ ద్వారా వాలంటీర్లను కూడా నియమించి విద్యాబోధన సక్రమంగా సాగేలా చేస్తున్నాం.

– కె.వెంకటయ్య, మండల విద్యాధికారి, శేరిలింగంపల్లి

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



కొండాపూర్ గోల్డెన్ తులిప్ కాలనీలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్‌పటేల్, డీసీ ప్రశాంతి, కాలనీవాసులు

ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి/రాయదుర్గం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని గోల్డెన్ తులిప్ కాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతితో కలిసి గురువారం మొక్కలు నాటారు. ఏఎంహెచ్ఓ శ్రీకాంత్‌రెడ్డి, స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ యశస్వి, శానిటేషన్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచుదాం... భూమిని కాపాడుకుందాం :

కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్

మొక్కలు పెంచడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు రాజశేఖర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, లత, రోజా, నాయకులు గౌస్, దేవేందర్, అమన్, బాలరాజు, సందీప్ పాల్గొన్నారు.కాగా కొండాపూర్‌లో హోంగార్డులు మొక్కలు నాటారు.



కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో..

సీఆర్ ఫౌండేషన్‌లో..

చందానగర్ : కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (నగర మిద్దెల తోటలు) వ్యవస్థాపక అధ్యక్షులు హర్కర శ్రీనివాస్ మొక్కలు నాటారు. సీఆర్ ఫౌండేషన్ ప్రాంగణంలో పలు ఆయుర్వేద మొక్కలు నాటారు.

మహిళ అదృశ్యం



శోభ (ఫైల్)

మియాపూర్: మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన మేకల శోభ(50) జీహెచ్ఎంసీలో స్వీపర్. గత నెల 25వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు శోభ నాంపల్లిలో ఫంక్షన్‌కు బయల్దేరింది. మరుసటి రోజు ఉదయం కుమారుడు బాలకృష్ణ బంధువులకు ఫోన్ చేయగా ఆమె రాలేదని వారు తెలపడంతో కుమారుడు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

17వ అంతస్తు పైనుంచి పడి యువకుడు మృతి

గచ్చిబౌలి: ఇంటీరియర్ పనులు చేస్తూ 17వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్నూల్ జిల్లా ఆదోని మండలం బల్లెకల్లు గ్రామానికి చెందిన బొయ తలారి హన్మంత్(21) ఫిల్మ్‌నగర్‌లో నివాసం ఉంటూ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ ఇంటిరీయర్స్ వద్ద పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో పనిచేస్తూ 17వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కొద్ది గంటల్లోనే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నార్సింగి మున్సిపాలిటీకి అవార్డు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలు, ఘన వ్యర్థాల నిర్వహణ, పచ్చదనాన్ని ప్రోత్సహించడం వంటి వాటిలో కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కింది. గురువారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణ మోహన్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల పక్కన సంవత్సరం నుంచి మూడేళ్ల వయసు ఉన్న మొక్కలను నాటి పరిరక్షించామన్నారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్‌ల నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి ఘన వ్యర్థాలుగా, వర్మికంపోస్ట్ తయారు చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీ ప్రజలు, వ్యాపారులు సహకరించటం వల్లనే ఇది సాధ్యమయ్యిందన్నారు.



కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 25, పచ్చిమిర్చి 45 , బెండ 40, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 40, గోకర 60, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 100, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: రెడ్డికాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు సాయినగర్, సాయిజ్యోతినగర్, రెడ్డి కాలనీ, 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బికే ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీ పార్ట్, అదేవిధంగా మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

భూభారతితో భూసమస్యలు పరిష్కారం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో గురువారం జంగంపేట, వావిలాల గ్రామాల్లో భూభారతి సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ దేవదాస్ మాట్లాడుతూ... ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు భూభారతిలో పరిష్కరించబడతాయని తెలిపారు. వావిలాల గ్రామంలోని 52 అర్జీలు, జంగంపేట గ్రామ రైతులనుండి 19 అర్జీలు అందినట్లు తెలిపారు.

వార్డుల కేటాయింపుపై అభ్యంతరం

జిన్నారం (పటాన్‌చెరు): వార్డుల విభజన సక్రమంగా జరగలేదంటూ గుమ్మడిదల మున్సిపాలిటీ అఖిలపక్ష నాయకులు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. నగర విస్తరణలో భాగంగా ప్రభుత్వం నూతన మున్సిపాలిటీలు ఏర్పాటు చేసింది. గుమ్మడిదల మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల కేటాయింపులు సరైన క్రమంలో చేయలేదని స్థానిక నాయకులు ఆరోపించారు. మరోసారి వార్డుల విభజన ప్రక్రియను వరుస క్రమంలో చేపట్టాలని కమిషనర్ రఘుకు అఖిలపక్ష నాయకులు వినతి పత్రం అందించారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణా శిబిరం



వీసీ ఐనుల్ హసన్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న కల్నల్ రవీంద్రరావు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 11 ఆర్టిలరీ బ్యాటరీ హైదరాబాద్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పది రోజుల వార్షిక ఎన్‌సీసీ శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రవీంద్రరావు ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధాల నిర్వహణ, షూటింగ్, మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం యోగా గురువు బి లోకేశ్వర్‌రావు యోగా సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ఇస్తియాక్ అహ్మద్, ప్రొ.అజీమ్, డాక్టర్ మహతిప్రియదర్శిని, వేణుగోపాలరావు, అనిల్, ఎంఏ ముజీం తదితరులు పాల్గొన్నారు.

రూ.1.60 కోట్లతో యూజీడీ పనులకు శంకుస్థాపన



భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్‌ల పరిధిలో సుమారు రూ.1.60 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్పొరేటర్లు పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి ఆయన మాతృశ్రీనగర్, జనప్రియనగర్, రామకృష్ణనగర్ ప్రాంతాలలో యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేపడతామన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో రూ.40 లక్షలు, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో జనప్రియనగర్ ఫేజ్–2లో రూ.85 లక్షలు, రామకృష్ణనగర్, ప్రజయ్‌సిటీ కాలనీలలో రూ.35 లక్షలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం అమీరుద్దిన్, నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్‌లో జడ్సీ పర్యటన



ఆదిత్యనగర్‌లో పర్యటిస్తున్న జడ్సీ హేమంత్, కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్

చందానగర్ : మాదాపూర్ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే వివరాలు సేకరించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి గురువారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. కాకతీయ హిల్స్‌లో సీసీ రోడ్లు, ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్, ఇజ్జత్‌నగర్, భిక్షపతినగర్‌లలోని శ్మశానవాటికలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో పైపులైన్ పగిలి రోడ్డుపై మురుగు పారుతోంది. సమస్య గురించి కాలనీవాసులు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన అధికారులతో కలిసి గురువారం కాలనీలో పర్యటించారు. సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఏఈ ప్రియాంక, సూపర్‌వైజర్ నరేంద్ర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర జూడో అసోసియేషన్ కమిటీ అభినందన సభ



సభలో జూడో నూతన కమిటీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని రిషి ఇంజినీరింగ్ కళాశాలలో ఆ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ రాజశ్రీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ నూతన కమిటీ అభినందన సభను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయవాది సుధాకర్ రావు హాజరై మాట్లాడుతూ.. జూడో క్రీడాభివృద్ధికి, తెలంగాణ జూడో సంఘం బాధ్యుల సహాయ సహకారాలతో రానున్న రోజుల్లో మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాలో రాష్ట్ర, జాతీయస్థాయి జూడో పోటీలు నిర్వహణకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రాష్ట్ర జూడో అధ్యక్షుడు కైలాష్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నూతన కమిటీలు వేయడంతో పాటు జూడో క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అజీజ్ ఫారూఖీ, కోశాధికారి ఎంఎస్ రవీందర్, ఉపాధ్యక్షుడు డా. రామ్ లక్ష్మణ్, జెల్లెల శ్రీనివాస్‌రావు, రమాదేవి, సంయుక్త కార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం సాధ్యమే

- కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఆనంద్
- 'ఎస్కీ' క్యాంపస్‌లో 'ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్' థీమ్‌పై ప్రత్యేక సమావేశం



సైంటిస్ట్ డాక్టర్ ఆనంద్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం సాధ్యమేనని, సర్క్యులర్ ఎకానమీ విధానంలో రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్‌తో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో గురువారం 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'ఎండింగ్ పొల్యూషన్ థీమ్‌పై ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రష్యా కామన్వెల్త్, జపాన్ దేశాల్లో కేవలం నాలుగు శాతం మాత్రమే ప్లాస్టిక్ వినియోగం ఉందని వివరించారు.

నగరంలోని చెత్తలో 60 నుంచి 70 శాతం ప్లాస్టిక్ ఉత్పత్తులే

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్

కేంద్రం 2020 లో సింగిల్ ప్లాస్టిక్ యూసేజ్‌ను నిషేధించినప్పటికీ ఆయా వస్తువులు ఇంకా మార్కెట్‌లోకి వస్తూనే ఉన్నాయని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ పేర్కొన్నారు. నగరంలో రోజూ ఉత్పత్తి అవుతున్న సుమారు 6,500 మెట్రిక్ టన్నుల చెత్తలో 60 నుంచి 70 శాతం ప్లాస్టిక్ ఉత్పత్తులే ఉంటున్నాయని, వీటిలో అధికంగా ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ సీసాలతో పాటుగా, ప్లాస్టిక్ కవర్లు ఉన్నాయన్నారు. ఈ కవర్లను పశువులు తిని అనారోగ్యంతో చనిపోతున్నాయన్నారు. రోజువారి అవసరాలకు కాటన్ సంచులు స్టీల్ పాత్రలు వాడాలని సూచించారు.

ప్రపంచానికే పెను సవాల్‌గా ప్లాస్టిక్

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర రావు

ప్లాస్టిక్ పెనుభూతం ప్రస్తుతం భూమిమీదనే కాదు, అంతరిక్షంలోనూ, సముద్రాల లోతుల్లో కూడా విపత్తు సంభవించి ప్రపంచానికి పెను సవాల్‌గా మారిందని'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. మనిషి జీవితంలో ప్రతీ కదలికలో ప్లాస్టిక్ వినియోగం ఉంటున్నదన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ సిహెచ్ రంగారావు ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానంపై ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్రీనాథ్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, సెంటర్ ఫర్ క్లైమేట్ చేంజ్ హెడ్ డాక్టర్ చంద్రకళ, ఫ్యాకల్టీ డాక్టర్ నరేష్, నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

హెచ్‌సీయూలో..

రాయదుర్గం: ప్రపంచ స్థాయిలో ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై మరింత అవగాహన కల్పించాలని ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేష్ జొన్నలగడ్డ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఈపీటీఆర్ఐ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గింపునకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రతిఒక్కరూ పూర్తిగా సహకరించాలన్నారు.